నమస్తే తెలంగాణ

నిర్మల్

5 | నిజామాబాద్, బుధవారం 27 మార్చి 2024 | NIRMAL

## మెరుగైన విద్య అందించాలి..



విద్యార్థులకు బోధిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మార్చి 26 : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం చించుఘాట్ గిరిజన ప్రాథమిక పాఠశాల, వాన్వత్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జెండాగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. అనంతరం బోర్డుపై లెక్కలు వేస్తూ విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పీవో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించాలన్నారు. ఆశ్రమాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

## ఆవుకు సీమంతం



ఆవుకు సీమంతం నిర్వహిస్తున్న రైతు నర్సయ్య, కుటుంబ సభ్యులు

కుంటాల, మార్చి 26 : భారతీయ సంస్కృతిలో ఆవులు, ఎద్దులకు విశిష్ట స్థానం ఉంది. అటువంటి ఆవుకు తమ ఆడ కూతురికి చేసిన మాదిరిగానే సీమంతం చేశారు. బంధువులు, చుట్టూ పక్కలవారు, స్నేహితులు, ఆప్తులను పిలిచారు. అక్షింతలు వేసి దీవించారు. ఈ వేడుక మంగళవారం నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలంలో గల పెంచికల్‌పాడ్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గురజాల నర్సయ్య కుటుంబం గోమాతకు సీమంతం నిర్వహించారు.

పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు



# విత్తన భారం



### పెరిగిన పత్తి విత్తనాల ధర

### బీటీ-2 450 గ్రాముల ప్యాకెట్ రూ.864



పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు (ఫైల్)

ఆదిలాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పత్తి అధికంగా సాగవుతున్నది. గతేడాది 3.85 లక్షల ఎకరాల్లో సాగైంది. పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరల కారణంగా పెట్టుబడి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో అన్నదాతలకు సాగు భారం కానున్నది. 450 గ్రాముల బీటీ-2 విత్తనాల ప్యాకెట్‌ను రూ.864కు విక్రయించాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం యేటా పత్తి విత్తనాల ధరను పెంచుతూ పోతున్నది. 2019లో 450 గ్రాముల బీటీ-2 ప్యాకెట్ ధర రూ.710.. 2020లో రూ.730.. 2021లో రూ.767.. 2022లో రూ.810.. 2023లో రూ.853కు చేరింది. ఈ ఏడాది రూ.11 పెరిగి రూ.864 చొప్పున రైతులకు లభించనున్నది. ఐదేళ్లలో పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.154కు చేరడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నది.

**చీడ,పీడలను తట్టుకుని దిగుబడిని ఇస్తాయి..**

రైతులు యేటా వానకాలంలో పత్తి సాగు చేస్తారు. జూన్ మొదటి వారంలో విత్తనాలు వేస్తారు. ఇందుకోసం నెల రోజుల నుంచి భూమిని దున్ని విత్తనాలను సిద్ధం చేసుకుంటారు. సాగులో భాగంగా బీటీ-2(బేసిల్స్ తురిన్ జెన్సిస్) రకం విత్తనాలను వినియోగిస్తారు. ఈ జన్యు మార్పిడి పత్తి విత్తనాలను చీడ, పీడలను తట్టుకుని ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. ఏటా వానకాలం సీజన్‌లో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విత్తనాలు కొరత నివారించడానికి ఎనిమిది లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్‌లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. సీజన్‌కు ముందుగానే పలు కంపెనీలు బీటీ విత్తన తయారీ కంపెనీలు పెద్దమొత్తంలో ప్రచారం నిర్వహిస్తాయి. ఏవీ నకిలీవో, ఏవీ అసలివో తెలియక బీటీ విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు దిగుబడులు సరిగా రాక నష్టపోవాల్సి వస్తున్నది. జిల్లాలోని రైతులు రెండు, మూడు కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేస్తారు. దీంతో రైతులు విత్తనాల దుకాణాల ఎదుట బారులు తీరి కనిపిస్తారు. కొందరు రైతులకు కావాల్సిన విత్తనాలు దొరకక ఇతర కంపెనీలను కొనుగోలు చేస్తారు. ఏటా విత్తనాల ధరలను పెంచుతూ రైతులపై ఆర్థిక భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం పంటకు మద్దతు ధర కల్పించడంలో విఫమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పారదర్శకంగా నిర్వహించాలి..

- తాగునీరు, ధాన్యం కొనుగోళ్లపై ఆరా
- వీసీలో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి కలెక్టర్‌లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించారు. ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్, మే 13న ఎన్నికలు, జూన్ 4న ఫలితాలు ఉంటాయన్నారు. అధికారులు ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. సిబ్బందికి విధులపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు, రిజర్వు ఉద్యోగుల వివరాలు, సర్వేలైన్ టీంలు, పోలింగ్ సిబ్బంది, కేంద్రాల వంటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏర్పాట్లు చేశామని, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. అంతకు ముందు వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఆవాసానికి నీళ్లు సరఫరా చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.

# వానర బీభత్సం

### గుంపులు గుంపులుగా సంచారం

- ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- చేతిలో కర్ర లేకుండా వెళ్లలేని దుస్థితి
- ఒకరు మృతి.. పలువురికి గాయాలు..
- మంకీ రెస్క్యూ సెంటర్‌ను పట్టించుకోని పాలక వర్గాలు



నిర్మల్‌లోని ఇండ్ల మధ్య గుంపులుగా సంచరిస్తున్న కోతులు

నిర్మల్, మార్చి 26(నమస్తే తెలంగాణ) : నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతోపాటు గ్రామాల్లో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనం ఇండ్ల నుంచి బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. చేతిలో కర్ర లేకుండా వెళ్లడం లేదు. ఒక వేళ కోతిని బెదిరిస్తే పదుల సంఖ్యలో కోతులు వచ్చి ఎదురుదాడి చేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రోజు పదుల సంఖ్యలో గాయపడ్డవారు వస్తున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు.

- సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామానికి చెందిన సునీల్ కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తన పంట చేను వద్దకు వెళ్లగా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. దీంతో వాటి నుంచి తప్పించుకునేందుకు పరుగెత్తగా బండరాయిపై పడిపోవడంతో మృత్యువాత పడ్డాడు.
- నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన సంజీవ్‌పై కోతులు దాడి చేయడంతో కాలు, చేయి విరిగాయి. పంటలను కూడా రక్షించుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. అధికారులు స్పందించి జనాన్ని, రైతులను కాపాడాల్సిన అవసరం ఉంది.

**పట్టించుకోని మున్సిపాలిటీలు, పంచాయతీలు**

కోతులను పునరావాస కేంద్రాలకు తరలించాల్సి ఉండగా.. మున్సిపాలిటీలు, పంచాయతీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే కోతులు పట్టే వ్యవహారం ఖరీదుగా మారడం, పట్టేవారు కూడా అందుబాటులో లేకపోతుండడం సమస్యగా మారింది. కొద్ది రోజుల క్రితం నిర్మల్ శివారులోని చించోలి(బి) వద్ద గల కోతుల పునరావాస కేంద్రానికి సిద్దిపేట, నర్సాపూర్ మున్సిపాలిటీల నుంచి దాదాపు 500 కోతులను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం తీసుకొచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. నిర్మల్ జిల్లా నుంచి మాత్రం ఆశించిన రీతిలో పునరావాస కేంద్రానికి కోతులను స్టెరిలైజేషన్ కోసం తీసుకురాకపోతుండడం విమర్శలకు తావిస్తున్నది.

**మూడున్నరేళ్లుగా కేవలం 1,467 ఆపరేషన్లే..**

నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని చించోలి(బి) వద్ద గల కోటి రూపాయలతో 2020లో ఏర్పాటు చేసిన మంకీ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ (కోతుల పునరావాస కేంద్రం)లో కేవలం 1,467 కోతులకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు(స్టెరిలైజేషన్) చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, పంచాయతీలలో గల కోతులను పట్టుకుని కేంద్రానికి తీసుకురావాలి. ఇక్కడ స్టెరిలైజేషన్ కాగానే వాటిని తిరిగి అదే ప్రాంతానికి పంపుతారు. రోజు 20కి పైగా స్టెరిలైజేషన్ చేసే సౌకర్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 150కి పైగా స్టెరిలైజేషన్ చేసి వారం రోజులపాటు ఇక్కడే పునరావాసం కల్పించే సౌకర్యం కూడా ఉంది. ఇక్కడ ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా ఇప్పటి వరకు దాదాపు 5 నుంచి 10 వేల కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. కేవలం 1,467 కోతులకు మాత్రమే చేశారు. జనాలకు ఇబ్బంది అవుతున్నప్పటికీ పాలకవర్గాలు పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం**



కోతుల సంఖ్య తగ్గించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. కోతుల నియంత్రణకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు చొరవ తీసుకోవాలి. కొందరు కోతులను పట్టించి అడవిలో వదిలేస్తున్నారు. అలా చేయకుండా పట్టిన కోతులను కచ్చితంగా నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌కు తీసుకురావాలి.

*- డాక్టర్ శ్రీకర్ రాజు, వైద్యాధికారి, మంకీ రెస్క్యూ, రిహాబిటేషన్ సెంటర్, నిర్మల్*



కోతుల దాడి చేయడంతో కాలు, చేయి విరిగి చికిత్స పొందుతున్న సంజీవ్(ఫైల్)



గాయపడి మృతిచెందిన సునీల్(ఫైల్)

## పాముకాటుతో యువరైతు మృతి



భుజంగరావు(ఫైల్)

దస్తురాబాద్, మార్చి 28 : గొడిసేర్యాల గొండు గూడెం(జీ) గ్రామానికి చెందిన రైతు మెస్రం భుజంగరావు(26) పాము కాటుతో మృతి చెందాడు. ఎస్ఐ యాసీర్ అర్ఫాత్ వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ సోమవారం ఉదయం మహేశ్ అనే రైతు పొలంలో మందు కొట్టడానికి భుజంగరావు వెళ్లాడు. మందు పిచికారీ చేస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే పొలం యాజమానికి సమాచారం అందించడంతో ఆయన తన కారులో ఆకొండపేట గ్రామానికి చెందిన నాటు వైద్యుడు పాముల మల్లయ్య వద్దకు తీసుకెళ్లాడు. చికిత్స నిమిత్తం భుజంగరావు భార్య మమత వద్ద రూ.15 వేలు తీసుకున్నాడు. వారం రోజులపాటు చికిత్స అందించాడు. ఈనెల 25వ తేదీ సోమవారం పరిస్థితి విషమించడంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు నాటు వైద్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నాడు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

## బాధిత కుటుంబాలకు పరామర్శ

జైనథ్(బేల), మార్చి 26 : బేల మండలంలోని బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. యువజన విభాగం జిల్లా కో-కన్వీనర్ కాటిపెల్లి స్వప్నిల్ తండ్రి స్వామి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దహెగాంలో నాక్లిక్ అనిల్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శివకుమార్, ప్రమోద్‌రెడ్డి, మనోహర్,సతీశ్‌పవార్,గంభీర్ ఠాక్రే, విఠల్, విశాల్, నారాయణ, మహేందర్ ఉన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేద్దాం..

### బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



మాన్కాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును శాలువతో సన్మానించిన పార్టీ శ్రేణులు

నార్నూర్, మార్చి 26 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గెలుపే లక్ష్యంగా పని చేద్దామని బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాన్కాపూర్ గ్రామాన్ని సందర్శించగా.. గ్రామస్తులు స్వాగతం పలికారు. ఎంపీ అభ్యర్థిని పార్టీ శ్రేణులు శాలువతో సన్మానించాయి. రాబోయే ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతి నాయకుడికి, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేద్దామన్నారు. అంతకు ముందు కొత్తపల్లి(హెచ్)లో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని సందర్శించారు. దీక్ష గురువు ప్రేమ్ సింగ్ మహరాజ్ ఆశీస్సులు పొందారు. మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్ పటేల్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్, ఐటీడీఏ డైరెక్టర్ మడావి మాన్కు, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాశీం, మాజీ సర్పంచ్‌లు ఉర్వేత రూప్‌దేవ్, ఆడ శ్రీరామ్, మడావి సాగర్, ప్రేమ్, నాయకులు కనక ప్రభాకర్, విష్ణుఫడ్, అజార్, ఫిరోజ్ ఖాన్, మెస్రం మానిక్‌రావ్, సుశాంత్, రాథోడ్ శివాజీ, షేక్ మసూద్, గోపాల్, దయానంద్, కాంబ్లే హన్మంత్ రావు, నగేశ్ పాల్గొన్నారు.

## వెనుక కాళ్లు.. వీపుపైన..

తాంసి(భీంపూర్), మార్చి 26 : అంతర్గాంకు చెందిన సోన్ టక్కె ప్రమోద్‌కు చెందిన ఆవు మంగళవారం తెల్లవారుజామున లేగ దూడకు జన్మనిచ్చింది. ఈ లేగ ముందు కాళ్లు సరిగ్గా ఉన్నా, వెనుక రెండు కాళ్లు వీపుపైన ఉన్నాయి. దీంతో లేగ నిలబడ లేక పోతున్నది. ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. కాగా.. తాము పరీక్షిస్తామని పశు వైద్యాధికారి సుభాష్ రాథోడ్ తెలిపారు.



వెనుక వీపుపై కాళ్లు ఉన్న లేగదూడ



నూతన వధూవరులతో ఎమ్మెల్యే బొజ్జు, ప్రజాప్రతినిధులు

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, మార్చి 26 : దస్నాపూర్ పంచాయతీ పరిధిలోని దస్నాపూర్‌గూడ పూలాజీ బాబా ధ్యాన కేంద్రం ఆవరణలో ఆంధ్ ఆదివాసీ సమాజ్, దస్నాపూర్‌గూడ ఆంధ్ ఆదివాసీ సాముహిక వివాహ వేడుక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎనిమిది మంది జంటలకు వివాహాలు చేశారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ ఆర్కా పుష్పలత పాల్గొని పూలాజీబాబా చిత్రపటానికి నివాళులర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్నాపూర్ గ్రామ పటేల్ పుండలిక్, ఆంధ్ ఆదివాసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి..

తాంసి(తలమడుగు), మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లాల సరిహద్దు చెక్ పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. మహారాష్ట్ర-ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన లక్ష్మీపూర్ చెక్‌పోస్టును మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ పాఠా చెక్‌పోస్టును పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అంతరాష్ట్ర రహదారి గుండా వెళ్లే వాహనాలను తనిఖీ చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. తలమడుగు మండలంలోనికి రోడ్డు, రైలు మార్గం గుండా అక్రమంగా మద్యం ప్రవేశించకుండా రైల్వే స్టేషన్‌లో నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఫణిందర్, ఎస్సై ధనశ్రీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి

### ఎన్నికల అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల మొదటి విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, 768 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 4,358 మందిని మొదటి విడుత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. అందులో 2,240 మంది ప్రిసైడింగ్ అధికారులు.. 2,145 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ప్రతి టీంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఇతర పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్వో తిరుమత, ఏవో అరవింద్, ఈడీఎం రవీందర్ ఉన్నారు.

## పాఠశాల సామగ్రి ధ్వంసం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 : ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రిని ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి పాఠశాల ఆవరణలోని ఇనుప పైపులతోపాటు కూర్చొనే గద్దెను పగుల గొట్టారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు అశోక్ మాట్లాడుతూ.. గతంలో కూడా సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ పాఠశాల ఆస్తిని పాడు చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి రాత్రి వేళల్లో పాఠశాలకు వాచ్‌మన్‌ను నియమించాలని కోరారు.




పాఠశాల బోర్డును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు